కొత్తపల్లి మండలంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి - 6లో

రామోజీరావు సేవలు చిరస్మరణీయం
» ఈనాడు గ్రూపు సంస్థల అధినేత మృతికి సంతాపం - 7లో

అసెంబ్లీ ఎన్నికల అనూహ్య ఫలితాల నేపథ్యంలో టీడీపీ కూటమి గద్దెనెక్కింది. కోట్ల ప్రజల ఆశలు నెరవేరేలా కూటమి జెండా రెపరెపలాడింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం కొలువు దీరనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న చంద్రబాబు క్యాబినెట్‌లో మంత్రులుగా ఎవరుంటారనే దానిపై జిల్లాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఎవరెవరికి అమాత్య యోగం పడుతుందంటూ రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. అటు తమకు మంత్రి పదవి వరిస్తుందంటూ పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు తమ లెక్కలు తాము వేసుకుంటు న్నారు. తమ పేరును ఎలాగైనా పరిశీలనలోకి తీసుకోవాలంటూ చంద్రబాబు, లోకేశ్‌లను కలుస్తూ తమ అభీష్టాన్ని వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి ఎంతమందికి ఛాన్స్ లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

యోగం ఎవరికో?





- టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో జిల్లాలో మంత్రి పదవులపై చర్చ
- క్యాబినెట్‌లో చోటు ఎవరికి దక్కుతుందనే దానిపై రకరకాల ఊహాగానాలు
- పరిశీలనలో పవన్, యనమల, రాజప్ప, జ్యోతుల, వర్మ పేర్లున్నట్లు ప్రచారం
- అయితే మంత్రివర్గంలో పవన్ ఉండకపోవచ్చంటూ సంకేతాలు
- పవన్ పదవి తీసుకుంటారా? లేదా? అనే దాన్ని బట్టి మిగిలిన వారిపై స్పష్టత
- జిల్లా పరిధిలో ఒకరా.. ఇద్దరా ఎంతమందికి అనే దానిపై సస్పెన్స్
- యనమల క్యాబినెట్‌లో ఉంటారా? లేదా? అనేదానిపై తలోరకం ప్రచారం
- తిరిగి మళ్లీ మంత్రి పదవి తనకే వస్తుందన్న ఆశతో రాజప్ప
- సీనియార్టీకి అమాత్య పదవితో న్యాయం జరుగుతుందని నెహ్రూ అంచనా
- పవన్ కోసం సీటు త్యాగం చేయడంతో తప్పక బెర్త్ లభిస్తుందని వర్మ లెక్కలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ప్రధానంగా పిఠాపురంనుంచి విజయం సాధించిన పవన్ క్యాబినెట్‌లో ఉంటారా? లేదా? అనేదానిపై కొంత గందరగోళం నెలకొంది. ఒకవేళ ఉంటే మాత్రం జిల్లాలో మిగిలిన ఆశావహులకు కొంత దెబ్బే. అటు యనమలకు ఎమ్మెల్యే పదవితో సంబంధం లేకుండా ప్రతిసారి పదవి వరిస్తోంది. ఈసారి క్యాబినెట్‌లో మంత్రి పదవి ఖాయమేనన్న చర్చ జరుగుతోంది. కానీ ఇదే సామాజికవర్గం తరపున టీడీపీ, బీజేపీ నుంచి ఇద్దరు రేసులో ఉన్నారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గిన తనకు మళ్లీ బెర్త్ ఖాయమని మాజీ మంత్రి రాజప్ప ధీమాగా ఉన్నారు. జగ్గంపేటనుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సీనియర్ నేత జ్యోతుల నెహ్రూ సైతం మంత్రి పదవి రేసులో ఉన్నారు. పిఠాపురంలో పవన్‌కళ్యాణ్‌కోసం సీటు త్యాగం చేసిన వర్మ సైతం తనకు చంద్రబాబు న్యాయం చేస్తానన్న హామీ గుర్తుచేస్తున్నారు. మత్స్యకార కోటాల్లో తనకు రావొచ్చని సిటీ ఎమ్మెల్యే విజేత కొండబాబు భావిస్తున్నారు.

పవన్ మంత్రిగా ఉంటారా?

వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు ఓటుతో ప్రజలు ఊచకోత కోశారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభంజనం సృష్టించింది. రికార్డుస్థాయి సీట్ల మెజార్టీతో అధికార పీఠం ఎక్కింది. దీంతో ఈనెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. దీంతో చంద్రబాబు క్యాబినెట్‌లో మంత్రులుగా ఎవరుంటారనే చర్చ జోరుగా సాగుతోంది. అమాత్య పదవి ఎవరిని వరిస్తుందనేదానిపై అనేక ఊహాగానాలు జరుగుతున్నాయి. వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 సీట్లకు 19 సీట్లు టీడీపీ కూటమి విజయభేరీ మోగించింది. అన్ని స్థానాలు కైవసం చేసుకుంది. గెలిచిన ఎమ్మెల్యేల్లో కొందరు సీనియర్లు ఉండగా, మరికొందరు తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఈ నేపథ్యంలో అమాత్య పదవిని వీరిలో అనేకమంది ఆశిస్తున్నారు. విజేతలు భారీగా ఉండడంతో పదవులు ఆశించేవారి సంఖ్య కూడా భారీగా ఉంది. ఈ నేపథ్యంలో మంత్రులుగా చంద్రబాబు ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. అమాత్య పదవికి ఉమ్మడి తూర్పుగోదావవరి జిల్లా ప్రాతిపదికగా చంద్రబాబు ఆయా ఆశావహులను ఎంపిక చేయనున్నారు. ఈ నేపథ్యంలో జనసేనకు సైతం బెర్త్‌లు కేటాయించాల్సి ఉన్నందున ఉమ్మడి జిల్లా నుంచి గరిష్ఠంగా ఇద్దరు లేదా ముగ్గురికి పదవులు దక్కవచ్చనే చర్చ జరుగుతోంది. ఇందులోను సామాజిక సమీకరణల లెక్కలు కూడా విశ్లేషిస్తున్నారు. ఈ కోణంలో ఎవరెవరికి ఛాన్స్ ఉంటుంది? ఎవరికి ఉండదు? అనేదానిపై రకరకాల విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. పిఠాపురంనుంచి నెగ్గిన పవన్‌కళ్యాణ్ మంత్రి పదవి తీసుకుంటారా? లేదా? అనే అంశం ఆధా రంగా మిగిలిన వారికి ఛాన్స్‌లు ఆధారపడి ఉండనున్నాయి. ఒకవేళ పవన్ మంత్రి పదవి తీసుకుంటే జిల్లాలో టీడీపీనుంచి ఒక్కరికైనా ఛాన్స్ ఉంటుం దా లేదా అనేదానిపై స్పష్టత రానుంది. ప్రస్తుతం చేతిలో చేయాల్సిన సిని మాలు ఏడు వరకు ఉండడం, అటు రాష్ట్రాభివృద్ధికి సంబంధించి కేంద్రంలో చేయాల్సిన పనులు చాలా ఉండడంతో మంత్రి పదవికి దూరంగా ఉండి వీటిని చక్కబెడతారనే విశ్లేషణలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యం లో పవన్ కాదంటే జిల్లాలో టీడీపీ తరపున కాపు సామాజివర్గంనుంచి ఒక రికి ఛాన్స్ దక్కనుంది. పవన్ కాదంటే జనసేన కోటాలో ఉమ్మడి జిల్లా నుం చి కందుల దుర్గేష్‌కు ఛాన్స్ దక్కనుంది. ఆయన పోటీ చేసిన నియోజక వర్గం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అయినా స్థానికత కోటా కింద ఉమ్మడి జిల్లా నుంచి పదవి ఇచ్చే అవకాశం ఉంది. టీడీపీ సీనియర్ నేత యనమల ఈసారి క్యాబినెట్‌లో ఉంటారా? లేదా? అనేదానిపై సగం ఛాన్స్ అని ప్రచారం జరుగుతోంది. ఈసారి యాదవ సామాజికవర్గం నుంచి టీడీపీ తరపున విశాఖ జిల్లా గాజువాక నుంచి పల్లా శ్రీనివాసరావు, ధర్మవరం నుంచి బీజేపీ తరపున సత్యకుమార్ రేసులో ఉన్నారు. బీజేపీ నుంచి ఒకరికి మంత్రి పదవి ఇవ్వాల్సి ఉంటే సత్యకుమార్‌కు పదవి వరించనుంది.

మిగిలిన వారిలో అదృష్టం ఎవరిదో..

గత టీడీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం, హోంమంత్రిగా చేసిన నిమ్మకాయల చినరాజప్ప ఇప్పుడు మూడోసారి పెద్దాపురం ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఈసారి కూడా తనకు మంత్రి పదవి వరించడం ఖాయమని భావిస్తున్నారు. ఇప్పటికే చంద్రబాబు, లోకేశ్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. జగ్గంపేట నుంచి సీనియర్ నేత జ్యోతుల నెహ్రూ ఈసారి కచ్చితంగా తనకు అమాత్య పదవి వస్తుందని ఆశతో ఉన్నారు. ఎన్నేళ్ల కోరిక చంద్రబాబు నెరవేర్చుతారని భావిస్తున్నారు. పిఠాపురం నుంచి పవన్ బరిలో ఉండడంతో ఆయన కోసం సీటు త్యాగం చేసిన మాజీ ఎమ్మెల్యే వర్మ తనకు మంత్రి పదవి లభిస్తుందని నమ్మకంతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్సీతోపాటు ఉన్నత పదవి ఇస్తానని ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ ఇప్పటికే అధినేతను కలిశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికగా రెండు లేదా మూడు మంత్రి పదవులు జిల్లాను వరించనున్నాయి. పవన్ పోటీచేస్తే మరో రెండు మంత్రి పదవులకు పోటీ తీవ్రంగా ఉండనుంది. ఒకవేళ ఉమ్మడి జిల్లాకు రెండే పదవులు ఇవ్వాల్సి ఉంటే ఆశావహులకు అవకాశాలు సన్నగిల్లనున్నాయి. అదే జరిగితే కాకినాడ జిల్లా నుంచి మరొకరికి ఛాన్స్ ఉండకపోవచ్చనే ప్రచారం కూడా జరుగుతోంది. ఒకవేళ పవన్ పోటీ చేయకపోతే కాకినాడ జిల్లా నుంచి టీడీపీ తరపున ఒకరికి, అమలాపురం, రాజమహేంద్రవరం జిల్లాల్లో ఒకరు టీడీపీ, జనసేనల్లో మరొకరు అవకాశం

ఉద్యోగస్తులు ఇలాగేనా... ఓటు వేసేది?

- పోస్టల్‌బ్యాలెట్‌లో 10శాతంపైగా చెల్లని ఓట్లు
- విస్మయం వ్యక్తం చేస్తున్న సాధారణ ఓటర్లు



పిఠాపురంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న ఉద్యోగులు

పిఠాపురం, జూన్ 8: విద్యావంతులైన ఉద్యోగస్తులు ఓటుహక్కు వినియోగించుకుంటే సక్రమంగా ఓటు వేస్తారని అందరూ భావిస్తారు. సాధారణ ఓటర్లే విజ్ఞతతో ఓటు వేస్తుండగా వీరు మాత్రం అందుకు రివర్స్. ఇక్కడ ఏకంగా 10శాతంపైగా చెల్లని ఓట్లు వచ్చాయి. ఇప్పుడు ఇది విస్మయం కలిగించే అంశంగా మారింది. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోలైన పోస్టల్ బ్యాలెట్లల్లో అధికంగా చెల్లని ఓట్లు ఉండడం చర్చనీయాంశమైంది. ఇలా ఎందుకు జరిగిందన్న అంశంపై ఇప్పుడు చర్చలు సాగుతున్నాయి. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీచేశారు. వైసీపీ అభ్యర్థిగా వంగా గీతావిశ్వనాథ్ రంగంలో నిలిచారు. ఓట్ల లెక్కింపులో పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలోనే రికార్డుస్థాయి మెజార్టీతో విజయం సాధించారు. పోస్టల్‌బ్యాలెట్ ఓట్లల్లో ఎక్కువ శాతం చెల్లకుండా పోవడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఉద్యోగస్తులు ఇలా ఎందుకు చేశారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ఇలా పోలయ్యాయి

ఎన్నికల విధుల్లో ఉన్న వారితోపాటు అత్యవసర డ్యూటీల్లో ఉన్న వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. ఇందులోభాగంగా పిఠాపురం, గొల్లప్రోలుల్లో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉద్యోగస్తులు ఓటువేసేలా అవకాశాన్ని ఇచ్చారు. నాలుగురోజులపాటు పోలింగ్ జరిగింది. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో 2,511 ఉద్యోగస్తులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఇందులో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు 1611 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌కు 559 ఓట్లు రాగా, బీఎస్పీ అభ్యర్థి పత్తిపాటి బుల్లిరాజుకు 5 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి మాదేపల్లి సత్యానందరావుకు 9 ఓట్లు, జైభీమ్ రావు భారత్ పార్టీ అభ్యర్థి జగ్గారపు మల్లిఖార్జునకు 4 ఓట్లు, తెలుగు జనతా పార్టీ అభ్యర్థి పెద్దింశెట్టి వెంకటేశ్వరరావుకు ఒక ఓటు, స్వతంత్ర అభ్యర్థి ఏడిద భాస్కరరావుకు 2 ఓట్లు పడగా, నోటాకు 8మంది ఓటు వేశారు. పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లల్లో 254 చెల్లని ఓట్లుగా గుర్తించారు.

ఇలా ఎలా

ఉద్యోగస్తులు అత్యంత జాగ్రత్తగా ఓటుహక్కు వినియోగించుకుంటారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అధిక సమయం ఇచ్చారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రత్యేక కేంద్రాల ద్వారా బ్యాలెట్ పేపర్‌పై ఓటువేసి దాన్ని బాక్సులో వేసే అవకాశం కల్పించారు. మొత్తం పోలైన ఓట్లల్లో పదిశాతం కాకుండా చెల్లకుండా పోవడంతో ఉద్యోగస్తులు ఇలా ఎందుకు చేశారన్న ప్రశ్న ఉత్పన్నమైంది. కావాలనే ఇలా చేశారా లేదా సాంకేతిక అంశాలతో ఇవి తిరస్కారానికి గురయ్యాయా అన్న అంశంపై చర్చ సాగుతోంది. ఎవరికి ఓటు వేయడం ఇష్టం లేకుంటే నోటాకు వేసే అవకాశం ఉన్నా అలా కాకుండా చెల్లకుండా చేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది. విద్యావంతులైన ఉద్యోగస్తుల ఓట్లు చెల్లకుండా పోవడం ఇప్పుడు పిఠాపురం నియోజకవర్గంతోపాటు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

రాయితీలకు మంగళం

- వైసీపీ హయాంలో భారంగా మారిన పశుపోషణ
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- కూటమి ప్రభుత్వంపై పాడిరైతుల ఆశలు



పెద్దాపురం, జూన్ 8: పాడి పరిశ్రమకు వైసీపీ ప్రభుత్వంలో ప్రోత్సాహం కరువైంది. రాయితీలకు మంగళం పాడగా కొన్ని పథకాలు సైతం అటకెక్కాయి. అందుబాటులో ఉన్నవాటి నుంచి కూడా సకాలంలో నిధులు రాలేదు. మరోవైపు గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన వాటిని పూర్తిగా ఆపేశారు. ఈక్రమంలో పెంపకందార్లపై తీవ్ర ప్రభావం పడింది. నూర్పుల్లో యాంత్రీకరణ, కరువు ఛాయలు, ఎండిన చెరువుల ఫలితంగా పశుగ్రాసం కొరత ఎక్కువైంది. ఫలితంగా పాడిరైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలో లక్షల్లో పశుపోషకులు ఉన్నారు. చాలా కుటుంబాలు గొర్రెలు, మేకలు, కోళ్లు, పశువులు గేదెలను పెంచి వాటి ద్వారా ఆదాయం పొందుతున్నారు. కాకినాడ జిల్లాలో ఆవులు 76,502, గేదెలు 2,82,273 గొర్రెలు 1,41,229 మేకలు 1,01,870, కోళ్ల 92,48,636 ఉన్నాయి. మొత్తంగా ఇవి 9.78 లక్షల వరకూ ఉన్నాయి. పచ్చికబయళ్లు, వరి గడ్డిపై ఆధారపడి వీటిని పెంచుతున్నారు. కొన్నేళ్లుగా వరిగడ్డి సక్రమంగా అందడంలేదు. గతంలో నూర్పు చేసిన తర్వాత వచ్చేదాన్ని ఏడాది పొడవునా నిల్వ ఉంచి పశుగ్రాసంగా వాడేవారు. కొన్నేళ్లుగా యంత్రాలతో కోత, నూర్పు వంటివి చేయడంతో గ్రాసం కొరత తప్పడంలేదు. చెరువులు, గుంతలు ఫిబ్రవరి నెలలోనే ఎండిపోయి నెర్రలు రావడంతో మేతకి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే క్రమంలో ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు అందక పాడిరైతులు గగ్గోలు పెడుతున్నారు.

గతంలో ఇలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో పాల ఉత్పత్తి పెంపునకు ఏటా పశుపోషకులకు పాతర గడ్డి(సైలేజ్) దాణా అందించేవారు. ఏటా టన్నుల కొద్దీ పాతర గడ్డిని గ్రామాలకు తరలించేవారు. 75శాతం రాయితీపై కిలో రూ.2కే సరఫరా చేసేవారు. పశుదాణా కూడా 75శాతం రాయితీ కిలో రూ.4కే దక్కేది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధుల కింద పశువుల సంరక్షణ కోసం గోకులం, మినీ గోకులం పేరిట షెడ్లు నిర్మించారు. 2019 తర్వాత పథకాన్ని వైసీపీ రద్దు చేసింది. అప్పట్లో ఉపాధి హామీ పథకం కింద ఊరూరా పశుగ్రాసం సాగు చేయించారు. అధిక సంఖ్యలో రైతులు దీన్ని సద్వినియోగం చేసకుని లబ్ధిపొందారు. కొరత ఉన్న ప్రాంతాలకు రాయితీపై విక్రయించి ఆదాయం పొందేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వేసవిలో దాహార్తిని తీర్చేందుకు పొలాల్లో అందుబాటులో చేతిపంపులు వద్ద తొట్టెలు నిర్మించేవారు. వైసీపీ వచ్చాకా ఆ నిర్మాణాల ఊసే లేదు. టీడీపీ హయాంలో దాణామృతం కిలో రూ.3 చొప్పున పంపిణీ చేయగా ప్రభుత్వం ధరను రూ.6.50కి పెంచింది.

పాల దిగుబడిపై ప్రభావం

ఎండాకాలం కావడంతో పాల దిగుబడిపైనా ప్రభావం కనిపిస్తోంది. గతంలో నాలుగైదు లీటర్ల పాలు ఇచ్చే పశువు ప్రస్తుతం రెండున్నర మూడు లీటర్లే ఇస్తోందని పశుపోషకులు చెబుతున్నారు. తద్వారా ఆదాయంపై ప్రభావం పడింది. దీంతో గ్రాసం కొనుగోలుకు కొందరు ఆసక్తి చూపడం లేదు.

పెరిగిన ధరలు..

వేసవి నేపథ్యంలో ఇటీవల వరకు 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పుడిప్పుడే వర్షాలు అడపా దడపా పడుతున్నాయి. పొలాల్లో ఎక్కడా పచ్చగడ్డి అందుబాటులో లేకపోవడంతో పశువులు విలవిలలాడుతున్నాయి. ప్రభుత్వం రాయితీపై పాతరగడ్డి ఇవ్వని కారణంగా గ్రామాల్లో వరిగడ్డే దిక్కవుతోంది. ప్రస్తుతం ట్రాక్టరు గడ్డి రూ.15వేలకు పైమాటే పలుకుతోంది. దీంతో పశుపోషకులు భారంగానే పశుపోషణ చేపడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో రాయితీలు కల్పిస్తారని, తద్వారా పశుపెంపకంపై భారం తగ్గుతుందని పశుపోషకులు భావిస్తున్నారు.

సాగునీరు చేరదు.. సాగు జరగదు



సామర్లకోట మండలం వీకే రాయపురంవద్ద అడ్డుకట్టతో నీరు రాలేని పరిస్థితి

- కాలువ ప్రవాహానికి అడ్డుకట్టలు ఇలా.. సాగు నీరు వచ్చేదెలా
- సీజన్ జాప్యంతో ఆందోళనలో రైతులు

సామర్లకోట, జూన్ 8: శనివారంనుంచి కాలువలకు నీరు విడుదల చేశాం. ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించాలి.. అంటూ ఒక పక్క వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ సామర్లకోట మండలంలోని 12 గ్రామాలకు చెందిన పొలాలకు, 42 వేల ఎకరాలకు సాగు నీరందించాల్సిన పీబీసీ కెనాల్‌కు సరఫరా అయ్యే ప్రధాన కాలువను హుస్సేన్‌పురం, ముత్యాలమ్మ విగ్రహం సమీపాన రెండు అడ్డుకట్టలు వేయడంతో గోదావరి కాలువలోని నీరు కిందికి ప్రవహించే మార్గాలు శనివారం నాటికి మూసుకున్నాయి. సామర్లకోట ఏడీబీ రోడ్డు నుంచి అచ్చంపేట సెంటర్‌కు వెళ్లే సాగర్‌మాల జాతీయ రహదారి బ్రిడ్జి నిర్మాణ పనుల దృష్ట్యా హుస్సేన్‌పురంవద్ద కాలువకు పెద్దఎత్తున అడ్డుకట్ట వేశారు. సదరు అడ్డుకట్ట వేసిన ప్రాంతంలో కాలువకు ఇరువైపులా కాంక్రీట్ పిల్లర్స్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఈ అడ్డుకట్ట వేసినట్లు తెలిసింది. ఈ అడ్డుకట్టలు ఇరిగేషన్, వ్యవసాయశాఖల ఉన్నతాధికారులకు తెలిసే వేశారా, ముందస్తు సమాచారం ఇచ్చారా, లేదా అనే అంశాలు సందిగ్ధంగా మారాయి. శనివారం ధవళేశ్వరం వద్ద తూర్పుడెల్టా కాలువకు నీరు విడుదల చేయడంతో ఇరిగేషన్ అధికారులు ప్రకటనలు చేయడంతో స్థానిక రైతులతోపాటు పీబీసీ కెనాల్ ఆయకట్టుదారులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు, మే నెల 10న కాలువలో నీటి విడుదలు నిలిపివేసిన విషయం విదితమే. 20రోజుల పాటు సదరు సాగర్‌మాల వంతెన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకుండా సరిగ్గా నీరు విడుదల చేస్తున్న సమయంలో కాలువకు అడ్డుకట్ట వేయడంతో ఇరిగేషన్, వ్యవసాయశాఖల ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారా అని సామర్లకోట, వీకే రాయపురం గ్రామాలకు చెందిన రైతులు ప్రశ్నిస్తున్నారు. జాతీయ రహదారులు, ఇరిగేషన్, వ్యవసాయశాఖల మధ్య సమన్వయలోపంవల్ల కాలువలో సాగునీరు కింది పొలాలకు అందక నిర్దేశిత కాలంలో ఖరీఫ్ సాగు పనులు నిర్వహించలేమని రైతులు ఆందోళన చెందుతున్నారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణాల ప్రజలకు, కాకినాడ నగరపాలక సంస్థ ప్రజలకు తాగునీరు అందించే రెండు జలాశయాలు పూర్తిగా అడుగంటాయి. ఈ కారణంగా జలాశయాల్లో నీరు సరిపడినంత లేక పోవడంవల్ల మూడు పట్టణాలకు గోదావరి జలాలు సరఫరా నిలిచిపోయాయి. సహజంగా జూన్ 1నే కాలువలో నీరు విడుదలైతే జూన్ 3నాటికి సామర్లకోటకు చేరుకుని అక్కడినుంచి నేరుగా రెండు జలాశయాలకు నీటిని మళ్లించేవారు. కాలువలోకి నీరు విడుదల చేసి 8రోజులు కావస్తున్నా నేటికీ నీరు సామర్లకోటకు చేరుకోకపోవడంపట్ల రైతుల్లో కలవరం నెలకొంది. ఈ మూడు పట్టణాలకు రోజుకు 25 ఎంఎల్‌డీల పరిమాణంగల తాగునీరు అవసరం ఉంది. హుస్సేన్‌పురంవద్ద కాలువకు అడ్డుకట్ట వేయడంవల్ల మూడు పట్టణాల ప్రజలు దాహార్తి సమస్యను మరికొంతకాలం భరించక తప్పదని మూడు పట్టణాలకు సంబంధించిన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు భావిస్తున్నారు. ముత్యాలమ్మ విగ్రహం సమీపాన కాలువకు అడ్డుకట్ట వేయడంతో వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల పొలాలకు సాగునీరు లభ్యత ప్రశ్నార్థకంగా మారిందని కలెక్టర్ సత్వరం స్పందించి హుస్సేన్‌పురం వద్ద కాలువకు వేసిన అడ్డుకట్టను తొలగించి సామర్లకోట దిగువకు గోదావరి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే వర్మతో సుజయ కృష్ణ రంగారావు భేటీ

పిఠాపురం, జూన్ 8: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మతో మాజీ మంత్రి, టీడీపీ జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణరంగారావు భేటీ అయ్యారు. కాకినాడలోని వర్మ నివాసానికి వచ్చిన శనివారం ఆయన రెండు గంటలపాటు చర్చలు జరిపారు. గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో వర్మ కారుపై రాళ్లు, ఇటుకలు, సీసాలతో దాడి చేసి అద్దాలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై సుజయ కృష్ణరంగారావు ఆరా తీశారు. సంఘటన వివరాలు తెలుసుకున్నారు. దాడి జరిగిన సమయంలో తీసిన వీడియోలు, దాడిలో పాల్గొన్న వారి వివరాలను వర్మ సుజయకు వివరించారు. టీడీపీనుంచి జనసేనలోకి కొత్తగా చేరిన నాయకులతో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి తెలియజేశారు. ఇదే విషయంపై ఇద్దరు నేతలు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడితో ఆదివారం భేటీ కానున్నట్లు సమాచారం. చంద్రబాబు దృష్టికి అన్ని విషయాలు తీసుకువెళ్లాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఈ భేటీలో వర్మ తనయుడు గిరీష్‌వర్మ కూడా పాల్గొన్నారు. కాగా



వర్మతో భేటీ అయిన జోన్-2 టీడీపీ ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగారావు

వర్మపై దాడిని ఖండిస్తూ ఆయనకు సంఘీభావం తెలిపేందుకు పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలనుంచి భారీగా టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. వర్మకు అన్నివేళలా అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ టీడీపీ కేడర్ అంతా వర్మ నివాసం వద్దే ఉన్నారు.



స్వచ్ఛందంగా రాజీనామా చేస్తారా... ఉత్తర్వుల కోసం వేచిచూస్తారా?

● చర్చనీయాంశంగా అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యుల భవితవ్యం ● చోటు దక్కించుకునేందుకు ద్వితీయశ్రేణి నాయకుల ప్రయత్నాలు

అన్నవరం, జూన్ 8: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పాలక మండలి సభ్యులు కొనసాగింపు రత్నగిరిపై చర్చనీయాంశంగా మా రింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి ప్రభుత్వాలు తమ నాయకుల సిఫార్సుతో వారి అనుచరులకు పాలకమండలి సభ్యులుగా నియమిస్తారు. గత ప్రభుత్వంలో రెండు పర్యాయాలు పాలకమండలిని నియమించగా ప్రస్తుతం ఉన్న పాలకమండలి 2023 ఫిబ్రవరి 9న ప్రమాణస్వీకారం చేయగా వారికి 2025 ఫిబ్రవరి 8తో గడువు ముగియనుంది. నూతనంగా ఎన్‌డీఏ ప్రభుత్వం కొలువుదీరనుండడంతో పలు చోట్ల నామినేటెడ్ పదవులకు కొందరు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తుండగా అన్నవరం దేవస్థానంలో సభ్యులు మాత్రం స్వచ్ఛందంగా తప్పుకుంటారా లేక ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చేవరకు వేచిచూస్తారా అనేది తేలాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరకముందే సీఎంవో కార్యాలయం నామినేటెడ్ పోస్టులను రద్దు చేస్తున్నట్లు ఇప్పటికే ఉత్తర్వులు వెలువరించగా ఆదేశాలు సంబంధిత కార్యాలయాలకు చేరలేదు. ప్రస్తుతం ఉన్న పాలకమండలిలో చైర్మన్, ఐ.వి. రోహిత్ వంశపారంపర్య ధర్మకర్తగా, ప్రధానార్చకులు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కొనసాగుతున్నారు. వీరిద్దరు మినహా ఉత్తర్వులు వెలువడితే 14 మంది సభ్యులు రాజీనామాలు చేయాల్సిందే. దేవస్థానంలో పాలకమండలి సభ్యులు ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై దృష్టిసారించాల్సి ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా కేవలం తమ అనుచరగణంకి దర్శనాలు, సత్రంగదులు కేటాయించలేదంటూ సమావేశపు హాలులో చర్చించడంతో అప్పట్లో పలు విమర్శలు వచ్చాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గత రెండునెలలుగా ఎటువంటి పాలకమండలి సమావేశాలు నిర్వహించలేదు. ప్రభుత్వం మారకుండా ఉంటే జూన్ చివరివారంలో పాలకమండలి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుత బోర్డు సభ్యులతో ఇక సమావేశం లేకుండానే సెండాఫ్ ఇచ్చే అవకాశాలు ఎక్కువ కనిపిస్తున్నాయి. నూతన పాలకమండలి నియామకానికి ఇంకా రెండు, మూడు నెలల సమయం పడుతుండడంతో చైర్మన్‌తో ఈవో, సంబంధిత విభాగాల అధికారులు చర్చించి ముఖ్యమైన అంశాలకు ఆమోదం తెలుపుతారు. నూతన ప్రభుత్వంలో కొత్త పాలకమండలిలో చోటు దక్కించుకునేందుకు ఇప్పటికే కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. గత టీడీపీ హయాంలో పాలకమండలి సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ జారీచేసి దరఖాస్తులు ఆహ్వానించి వారిని నియమించే ముందు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో ఆయా ఆశావాహులపై ఎటువంటి క్రిమినల్ కేసులు ఉన్నా వారి పేర్లను నిర్మోహమాటంగా తొలగించేవారు. వైసీపీ ప్రభుత్వంలో ఎటు వంటి నోటిఫికేషన్లు, విచారణలు లేకుండానే నేరుగా సభ్యులను నియమిస్తూ జీవోను జారీ చేశారు. త్వరలో వచ్చే నూతన పాలకమండలి సభ్యుల నియామకంలో పాత విధానం కొనసాగిస్తారా, వైసీపీ తీసుకొచ్చిన విధానం కొనసాగిస్తారో వేచిచూడాలి. పాలకమండలి నియామకంలో తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాలనుంచి ఇద్దరు, జగ్గంపేట, కాకి నాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం నియోజకవర్గాల నుంచి ఒక్కో క్కరూ ఇతర ప్రాంతాల్లో పట్టున్న ఎమ్మెల్యేలు తమ అనుచరులకు పాలకమండలిలో సభ్యత్వం ఇప్పించేవారు. త్వరలో కొలువుదీరే ఎన్‌డీఏ ప్ర భుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ప్రాధాన్యం కల్పించాల్సి ఉండడంతో కూర్పు ఏవిధంగా ఉంటుందో వేచిచూడాలి. వైసీపీ ప్రభుత్వంలో డోనార్ కోటా కింద ద్వారంపూడిచంద్రశేఖరరెడ్డి మామకు రెండు పర్యాయాలు అవకాశం ఇవ్వడం మరో విశేషం.



రామ్‌చరణ్ కలెక్టర్‌గా కారులో వెళుతూ అరటి సైకిల్‌ను ఢీకొన్న సన్నివేశం



కలెక్టర్ పాత్రలో రామ్‌చరణ్ షూటింగ్ దృశ్యం

గేమ్ చేంజర్ సినిమా సందడి

● పేరవరంలో రామ్‌చరణ్‌పై షూటింగ్ సన్నివేశాల చిత్రీకరణ

ఆత్రేయపురం, జూన్ 8: ప్రముఖ హీరో రామ్‌చరణ్ కథానాయకుడిగా నిర్మిస్తున్న గేమ్ చేంజర్ సిని మా షూటింగ్ సన్నివేషాలు కోనసీమలో శరవేగంగా రూపొందిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు శంకర్ పర్యవేక్షణలో పేరవరం ఆర్అండ్‌బీ రోడ్డుపై శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చలనచిత్ర సన్నివేషాలు రూపొందించారు. రామ్‌చరణ్ కలెక్టర్ పాత్రలో నటిస్తున్న సన్నివేషాలను రూపొందించారు. సింహచలం, విశాఖపట్నం, మార్గాల్లో వెళుతున్నట్లుగా రోడ్డు నెమ్‌ప్లేట్లను ఏర్పాటుచేసిన దృశ్యాలు, రోడ్డు పక్కనే కొబ్బరిబొండాలు, తాటిముంజుల దుకాణాలు నెలకొల్పడం, హైటెక్ బస్సు అరటి సైకిల్‌ను ఢీకొట్టడం, యువకులు సైకిళ్లపై వెళ్తున్న దృశ్యాలను చిత్రీకరించారు. రామ్‌చరణ్ సినిమా సందడి దృశ్యాలను అభిమానులు కనులారా వీక్షించారు. ఈ సినిమాలోని పలు సన్నివేషాలను తెరకెక్కించారు.

భక్తవత్సల గోవిందా!

● వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.38.36లక్షలు
● స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే విజేతలు





వాడపల్లి వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, జూన్ 8: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పొటెత్తారు. వేకుమజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వా మివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్నారు. తులభారాలు, కానుకలు, తలనీలాలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామస్మరణతో అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. మండపేట ఎమ్మెల్యే విజేత వేగుళ్ళ జోగేశ్వరరావు, ఉంగుటూరి ఎమ్మెల్యే విజేత పత్సమట్ల ధర్మరాజులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజకీయ ప్రముఖులు, ప్రభుత్వ ఉద్యో గులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదా యం రూ.38.36 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి భక్తుల రద్దీ

పెద్దాపురం, జూన్ 8: కాకికాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారు జామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,99,950 అన్నదాన విరాళాలు రూ.89,619 ఆదాయం, కేశ ఖండన ద్వారా రూ.12,080, తులాభారం రూ.750, లడ్డూ ప్రసాదం ద్వారా 25,770, కానుక ద్వారా రూ.350 వెరసి రూ.4,28,519 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.



శృంగారవల్లభస్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

అప్పనపల్లి వెంకన్నకు పోటెత్తిన భక్తులు

● బాలబాలాజీ దేవస్థానం ఆదాయం రూ.4,18,282



మామిడికుదురు, జూన్ 8: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. శనివారం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని 4,585 మంది భక్తులు దర్శించుకున్నారని, 3,471మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.4,18,282 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదానానికి రూ.10వేలు విరాళం

బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి యలమంచిలి గ్రామం వైబీలంక బాడవకు చెందిన పాతబళ్ల సూర్యనారాయణ-సుధారాణి దంపతులు రూ.10వేలు విరాళాన్ని అందించారు. దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, జూన్ 8: అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన వి.మల్లపురాజు రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని దాత అన్నదాన సూపరింటెండెంట్ కంచి మూర్తికి అందజేయగా ఆయన దాతను అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు.



సూపరెంటెండెంట్ కంచి మూర్తికి విరాళం అందజేస్తున్న దాత

వర్మపై దాడి ఘటన దర్యాప్తునకు ప్రత్యేక బృందం

● ఫిర్యాదు చేసిన వన్నెపూడి సర్పంచ్

గొల్లప్రోలురూరల్, జూన్ 8: గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మపై దాడి సంఘటనపై దర్యాప్తు కోసం ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. దాడి సంఘటనపై వర్మ, ఇతర టీడీపీ నేతలు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గొల్లప్రోలు పోలీసుస్టేషన్ పరిధిలో అందిన ఫిర్యాదులు, పోలీసుల విచారణ తదితర నివేదికలను ఎస్పీ కార్యాలయానికి పంపాలని ఆదేశాలు అందాయి. ఒక సీఐ నేతృత్వంలో బృందం ఈ సంఘటనను విచారిస్తుందని పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి జరిగిన సంఘటనపై వన్నెపూడి సర్పంచ్ కందా సుబ్రహ్మణ్యం గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో జనసేన పార్టీకి అనుకూలంగా పనిచేయడంతో వర్మ తమ ఇంటికి వచ్చినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల జనసేన పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ బవిరిశెట్టి రాంబాబు తన రాజకీయ మనుగడ పోతుందనే భావనతో వర్మను హతమారిస్తే తమకు అడ్డురారని భావించి, రాంబాబు అనుచరులు మెయిళ్ల వీరరాఘవరావు, కందా సత్తిబాబు, దొడ్డిపట్ల తిరుపతయ్య, పాలిశెట్టి తమ్మారావు, జ్యోతుల శ్రీను, మెయిళ్ల శ్రీను, జ్యోతుల దత్త, కందా రాంబాబు, శ్రీనివాసరావు, ఎర్రా త్రిమూర్తులు, మొయిళ్ల బేబీ, రాజాతో సహా 70మంది వర్మ తదితరులు తిరిగి వెళుతుండగా రాళ్లు, ఇటుకలు, డ్రింక్ సీసాలు, ఇతర మారణాయుదాలతో దాడి చేసి కారు అద్దాలు పగులగొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారని వివరించారు. కొంత దూరంలో ఉన్న తాము అక్కడకు వెళ్లే సరికి వారు పరారైనట్లు తెలిపారు. దీనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. శనివారం రాత్రి వరకూ కేసు నమోదు చేయనుట్లు సమాచారం. పోలీసులు వివరాలు తెలిపేందుకు ముందుకు రావడం లేదు.

శ్రీప్రకాష్‌లో టీటీ పోటీలు ప్రారంభం



శ్రీప్రకాష్‌లో హోరాహోరీగా జరుగుతున్న టీటీ పోటీలు

పెద్దాపురం, జూన్ 8: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏపీటీటీఏ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. టీటీ పోటీలను ఉద్దేశించి పాఠశాల డైరెక్టర్, ఏపీటీటీఏ వైస్‌ప్రెసిడెంట్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో అత్యుత్తమ నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. తద్వారా మరిన్ని విజయాలను భవిష్యత్తులో సాధించగలుగుతామన్నారు. తమ పాఠశాలలో ప్రతీ ఏడాది టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కోచ్ వేణుగోపాల్ మాట్లాడుతూ టీటీ పోటీలు విద్యార్థుల క్రీడా భవిష్యత్తుకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 540మంది క్రీడా కారులు హాజరయ్యారు. మూడు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. తొలిరోజు అండర్ 11, 13, 15 విభాగంలో బాలురు, బాలికలు తలపడతారన్నారు. ఈ కార్యక్రమంలో టీటీ అంపైర్లు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన డొంకరాయి పవర్ కెనాల్ పనులు

● ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్

మోతుగూడెం, జూన్ 8: డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులు ఆదివారం సాయంత్రంతో ముగుస్తాయని ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ ఆదివారం అర్ధరాత్రి నుంచి లేదా సోమవారం ఉదయం నుంచి డొంకరాయి పవర్ కెనాల్ ఎల్‌సీ అనుమతులు బ్యాక్ చేయనున్నామన్నారు. గత నెల 28 నుంచి డొంకరాయి పవర్ కెనాల్‌కు అనుమతులు మంజూరు కావడంతో 16 కిలోమీటర్ల పొడవు గల డొంకరాయి పవన్ కెనాల్ రెండు రీచ్‌ల్లో కెనాల్ గట్లు బాగా దెబ్బతిన్న ప్రదేశాల్లో గ్రౌంటింగ్ పనులను, కెనాల్ అడుగు భాగంలో కాంక్రీట్ పనులను దాదాపు పూర్తి చేశామన్నారు. ఆదివారం ఎక్కడైన చిన్నచిన్న పనులు మిగిలి ఉంటే వాటిని కూడా ఆదివారం సాయంత్రంలోపు పనులు పూర్తి చేయిస్తామని అనంతరం గ్రిడ్ అధికార్ల ఆదేశాల మేరకు ఆదివారం అర్ధరాత్రి నుంచి లేదా సోమవారం నుంచి డొంకరాయి పవర్ కెనాల్‌లో నీటిని విడుదల చేసి పొల్లూరు, డొంకరాయి జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఎస్ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

● కెనాల్ పనులను పరిశీలించిన జెన్‌కో సీఈ

డొంకరాయి కెనాల్ మరమ్మత్తుల పనులను సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ శనివారం పరిశీలించారు. 16 కిలోమీటర్ల పరిధిలో గల రెండు రీచ్‌ల్లో గల గ్రౌంటింగ్, కాంక్రీట్ పనులను పరిశీలించి, ఎక్కడా ఎటువంటి నాణ్యతా లోపాలు తలెత్తకుండా అధికార్లు పర్యవేక్షణ నిరంతరం ఉండాలని ఇంజనీర్లకు సూచించారు. పనులు ఎప్పటికీ పూర్తి కానున్నాయో అక్కడ ఉన్న ఇంజనీర్లను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డొంకరాయి ఈఈలు విజయ్‌కుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కెనాల్ అడుగు భాగంలో కాంక్రీట్ పనులను చేస్తున్న కార్మికులు, పనులు పరిశీలిస్తున్న జెన్‌కో సీఈ

ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కోమట్లపల్లి ఎన్నిక

ఉండ్రాజవరం, జూన్ 8: ఉండ్రాజవరం మండలం కాల్ధరి గ్రామానికి చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు, ప్రముఖ పౌల్ట్రీ పరిశ్రమ యజమాని కోమట్లపల్లి వెంకట సుబ్బారావు శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయ న ఇంతవరకు ఫెడరేషన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కోళ్ల పరిశ్రమ ప్రస్తుతం ఒడిదుడుకులతో నడుస్తోందని, రైతులు సమస్యలు, నష్టాలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. సదరు సమస్యలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని అన్నారు. ఆయన ఎన్నికపట్ల మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, కోళ్ల పరిశ్రమ యజమానులు గన్నమని వెంకట సుబ్రహ్మణ్యం, కుడప చక్రపాణి, మల్లిన శ్రీనివాసరావు, బూరుగుపల్లి రాంబాబు, బూరుగుపల్లి వెంగళరావు, బూరుగుపల్లి శ్రీనివాసరావు, అభినందనలు తెలిపారు.



వెంకటసుబ్బారావును అభినందిస్తున్న మాజీ సర్పంచ్ వెంకటసుబ్రహ్మణ్యం

పెద్దాపురంలో చోరీ

● 10 కాసుల బంగారు ఆభరణాలు అపహరణ

పెద్దాపురం, జూన్ 8: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి సుమారు 10 కాసుల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయిన సంఘటన కాకికాడ జిల్లా పెద్దాపురం పట్టణ పరిధిలోని ప్లీడర్స్ వీధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్లీడర్స్ వీధిలో నివాసం ఉంటున్న నామా సతీష్ బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దుండ గులు ఇంట్లోకి చొరబడి దోపిడీకి పాల్పడ్డారు. దీనిపై పోలీ సులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు కోసం అన్వేషించారు. దీనిపై కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

జగ్గంపేట, జూన్ 8: రైసు మిల్లులో పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘ టన శనివారం జరిగింది. రాయ వరం మండలం చెల్లూరు గ్రామానికి చెం దిన పోలిశెట్టి వీరవెంకట సత్యనారా యణ జగ్గంపేట మండలం గుర్ర ప్పాలెంలో ఉన్న బాలాజీ రైసుమిల్లులో పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. ఇనుప గడించిను జరుపుతుండగా వెల్డింగ్ పనులు చేస్తున్న వైర్లు దానికి తగలడంతో విద్యుత్ షాక్ తగిలింది. దీంతో సత్యనారాయణ అక్కడికక్కడే చనిపోయాడు. జగ్గంపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

రంపలో అనూహ్యంగా టీడీపీకి పెరిగిన ప్రజాదరణ

● గతం మాదిరిగానే ఫలించిన కొత్త అభ్యర్థి ప్రయోగం

(రంపచోడవరం)

రంపచోడవరం మన్యం నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అనూహ్యంగా ప్రజాదరణ పెరిగింది. వివరాల్లోకి వెళితే 2019 ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి 59,112 ఓట్లు రాగా వైసీపీకి 98,318 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో 39,206 ఓట్ల మెజారిటీతో వైసీపీ విజయం సాధించగా ఈ ఎన్నికల్లో తెలుగుదేశం గత ఎన్నికల కంటే 30,975 ఓట్లను అదనంగా సాధించి ప్రతికూల పరిస్థితులను అధిగమించి, ఊహించని రీతిలో తెలుగుదేశం పార్టీ ప్రజాదరణ పొంది 90,087 ఓట్లను గడించింది. 2019 ఎన్నికల్లో వైసీపీకి 98,318 ఓట్లు సాధించగా ఈ ఎన్నికల్లో 17,370 ఓట్లను కోల్పోయి 80,370 ఓట్లను మాత్రమే సాధించింది. తెలుగుదేశం సాధించిన ఈ విజయానికి గల కారణాలను విశ్లేషిస్తే గత ఎన్నికలన్నిటినీ పరిశీలించి 1983 నుంచి 2019 వరకూ జరిగిన ఎన్నికల్లో 2004 వరకూ ఆరు ఎన్నికల్లో వరుస విజయాలను సాధించి 2009 నుంచి 2019 వరకూ వరుస అపజయాలను చవిచూసింది. 2009లో సుమారు 10 వేల ఓట్ల తేడాతో నష్టపోయిన తెలుగుదేశం పార్టీ 2014లో 20 వేల మేర ఓట్ల నష్టంతో పరాజయం పొందిన టీడీపీ, 2019 ఎన్నికలు వచ్చేసరికి 39,206 ఓట్ల నష్టాన్ని చవి చూసింది. దీంతో ఈస్థానం విషయంలోనూ అభ్యర్థిత్వం విషయంలోనూ అనేక పరిశీలనలు, సర్వేలతోపాటు తీవ్ర కసరత్తు చేసి, కొత్తవారికి ఇవ్వడం ద్వారానే ఇక్కడ విజయం సాధ్యమవుతుందని 1989, 2004 ఎన్నికల ఫలితాల ద్వారా గుర్తించి ఈమారు కొత్తవారిని బరిలో దించారు. ఆ మేరకే ఊహించనిరీతిలో మిరియాల శిరీషదేవి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగా ఆ మేరకే విజయం కూడా దక్కింది. ఈ విజయం ఎలా ఉందంటే ఏకంగా 2019 కంటే 30,975 ఓట్లను అదనంగా సాధించింది. ఇందులోగల ప్రధాన కారణంగా జనసేన వైపు నిలిచిన యువత ఓటు, బీజేపీ ఓటు కూడా తెలుగుదేశానికి బాగా బదిలీ అయింది. ఫలితంగా వైసీపీ ఓట్ల నుంచి 17,370 ఓట్లను చీల్చడం, పోలింగ్‌లో పెరిగిన 6వేల ఓట్లను దక్కించుకోవడం, గతంలో కంటే ముగ్గురు అభ్యర్థులు తగ్గడం, ఇతరులకు గతంలో వచ్చిన ఓట్లు కూడా మరలడం వంటి అనేక అంశాలు టీడీపీకే మేలు చేశాయి.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి

● నలుగురికి గాయాలు
● రామకోవెల శుభ్రం చేస్తుండగా జరిగిన వివాదం

కొత్తపల్లి, జూన్ 8: రామకోవెల శుభ్రం చేస్తుండగా అక్కడ నిద్రిస్తున్న యువకుడిని కాసేపు బయట ఉండమని చెప్పిన సంఘటనలో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య శనివారం రాత్రి గొడవ జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం కొండెవరం శివారు కాశివారిపాకలు గ్రామంలో ఉన్న రామాలయాన్ని శుభ్రం చేసేందుకు అదే గ్రామానికి చెందిన మహిళ శనివారం రాత్రి వెళ్లారు. అప్పటికే ఆలయంలో యువకుడు ఫ్యాన్ వేసుకుని నిద్రిస్తున్న సందర్భంలో మహిళ ఆలయాన్ని శుభ్రంచేయాలని కాసేపు బయటకు వెళ్లాలని చెప్పి ఫ్యాన్ స్విచ్ఛాఫ్ చేసింది. దీంతో కోపోద్రిక్తుడైన యువకుడు మహిళను జుట్టుపట్టుకొని లాగడం, ఈ విషయాన్ని ఆ మహిళ గ్రామంలో ఉన్న పెద్దలకు సమాచారం ఇచ్చింది. దీంతో గ్రామానికి చెందిన వైసీపీకి నాయకుడు వి.వెంకన్నతోపాటు అతని అనుచరులు మహిళను జుట్టుపట్టుకొని లాగిన యువకునిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. రామాలయం వద్ద గొడవ జరుగుతుందని గమనించిన టీడీపీ కార్యకర్తలు వెళ్లి గొడవకు కారణాలు ఆరా తీయడంతో ఎన్నికల నేపథ్యంలో ఉన్న మనస్పర్ధలతో వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై దాడిచేశారు. దాడిలో రాయుడు వెంకటరమణ, పిల్లి లోవరాజు, వాసంశెట్టి శ్రీను, రాయుడు అప్పారావుకు తీవ్రగాయాలయ్యాయి. తలకు తీవ్ర గాయాలవడంతో చికిత్స కోసం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకొన్న కొత్తపల్లి ఎస్ఐ పీవీ స్వామినాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



కాశివారిపాకల్లో వైసీపీ దాడిలో గాయాలపాలైన టీడీపీ కార్యకర్తలు

కాకినాడ

ఉక్కపోతతో ప్రజలు సతమతం

కొత్తపల్లి, జూన్ 8: మండలంలో శనివారం ఉదయం నుంచీ ఎండ తీవ్రత లేకపోయినప్పటికీ మబ్బులు ఉండడం, వాతావరణంలో గాలి లేకపోవడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యారు. వృద్ధులు, పిల్లలు, గర్భిణిలు అవస్థలు పడ్డారు. వర్షాకాలం ప్రారంభమైనా మండలంలో నేటి వరకు ఏకధాటిగా వర్షం దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. మండలంలో సరైన వర్షం కురవకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

స్లాబ్ రాళ్లను తక్షణం తొలగించాలి : కమిషనర్



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 8: డ్రైనేజీల్లో పూడికతీత పనులకు అవరోధంగా ఉన్న స్లాబ్ రాళ్లను తక్షణమే తొలగించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు వ్యాపారులను ఆదేశించారు. స్లాబ్ రాళ్లను స్వచ్ఛందంగా తొలగించకపోతే వాటిని నగరపాలక సంస్థ తరపున తొలగించి అందుకు అయ్యే ఖర్చును వసూలు చేస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన నగరంలో పూడికతీత పనులను పర్యవేక్షించారు. గాంధీనగర్, చీడీలపొర ప్రాంతాల్లో టీఎంఎక్స్ మిషన్ ద్వారా జరుగుతున్న డిసిల్టేషన్ పనులను ఆయన పరిశీలించి అక్కడ ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రేచర్లపేట, దుమ్ములపేట, సినిమారోడ్ ప్రాంతాల్లో కార్మికుల ద్వారా జరుగుతున్న పూడికతీత పనులను కూడా ఆయన పర్యవేక్షించారు. పలుచోట్ల పూడికతీత పనులకు డ్రైనేజీలపై ఉన్న స్లాబ్‌రాళ్లు అవరోధంగా ఉన్న అంశాన్ని ఆయన గుర్తించి వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పూడికతీత పనులు త్వరగా చేపట్టాలని రాబోయే వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందన్నారు. వ్యాపారులంతా సహకరించి స్వచ్ఛందంగా డ్రైనేజీలపై వేసిన రాళ్లను తొలగించాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తెప్పనాయుడు, సచివాలయ ఉద్యోగులున్నారు.

'ఇకపై తునిలో ప్రశాంత వాతావరణం'

తుని రూరల్, జూన్ 8: ఇకపై తునిలో ప్రశాంత వాతావరణం ఉంటుందని టీడీపీ యువనేత యనమల రాజేష్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే యనమల దివ్య పని చేస్తారన్నారు. తునిలో విలేకర్లతో ఆయన, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, ఎస్.సూరవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), కోటనందూరు టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజబాబు, తుని పట్టణాధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యను అఖండ మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం నియోజకవర్గ పట్టణ, గ్రామాల్లో దివ్య పర్యటనకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. తమ నేత యనమల రామకృష్ణుడు అడుగుజాడల్లో ముందుకు సాగుదామన్నారు.

'పవన్ నేతృత్వంలో పిఠాపురం అభివృద్ధి'

గొల్లప్రోలు, జూన్ 8: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నేతృత్వంలో పిఠాపురం నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు రథంబాటలో శనివారం మాతా ఫౌండేషన్, జనసైనికుల ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్ విజయం, కూటమి ప్రభుత్వం ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. జనసేన విజయం కోసం కృషి చేసిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, చల్లా పెదబాబు, శంకర్, మాజీ ఎంపీపీ ఉలవకాయల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

'ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి'

పెద్దాపురం, జూన్ 8: రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని పులిమేరు గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన అనంతరం నష్టపోయిన రాష్ట్రాన్ని ప్రత్యేక హోదా ఎంతో అవసరమన్నారు. కూటమితో అయినా హోదా సాధించాలని ఆకాంక్షించారు. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం నిధులను ఇచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరారు. వలూరి రాజబాబు, కడితి సతీష్, దేశెట్టి సురేష్, కుంచే అంజిబాబు, నారాయణరావు, బీడీల నాగేశ్వరరావు, ఏసు, భూషణం, అన్నవరం, రత్నం, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

ఏలేశ్వరం, జూన్ 8: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. శనివారం మండలంలోని మర్రివీడు గ్రామంలో మా ఊరు-మా ప్రజలు కార్యక్రమంలో ప్రజలు టీడీపీ నాయకులు కౌన్సిలర్ అలమండ చలమయ్య, విజయ ఫౌండేషన్ చైర్మన్ సఖిరెడ్డి విజయబాబుకి తాగునీరు, కరెంటు, ఆర్టీసీ బస్సు, రోడ్లు వంటి తమ సమస్యలు వివరించగా పరిష్కార దిశగా అడుగులు వేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా

తాళ్లరేవు, జూన్ 8: తాళ్లరేవు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రీమన్ కమిటీ అధ్యక్షుడు దున్నా జనార్ధనరావు, తాళ్లరేవు ఆసుపత్రి కమిటీ సభ్యుడు అద్దంకి లక్ష్మీనారాయణ శనివారం తమ పదవులకు రాజీనామా చేసి తమ రాజీనామా పత్రాలను సంబంధిత అధికారులకు అందించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కృష్ణమోహన్, డిప్యూటీ సివిల్‌సర్జన్ డాక్టర్ సరీష, కూర్మదాసు సంపత్‌కుమార్ ఉన్నారు.

రైతులకు ఉచితంగా భోజనాలు

పిఠాపురం, జూన్ 8: పట్టణంలోని పశువుల సంత వద్ద ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ అన్న పానీయ సదుపాయ కేంద్రంలో వరుసగా 60వ వారం శనివారం సాయిప్రియ సేవాసమితి ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా భోజనాలు అందించారు. వివిధ ప్రాంతాల నుంచి సంతకు వచ్చే రైతులు ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ఈ ఏర్పాటు చేసినట్టు సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపకుడు, జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తెలిపారు. జనసేన నాయకులు అల్లం కిషోర్, నాగేశ్వరరావు, జ్యోతుల నాని, విప్పర్తి కృపానందం, సూరిబాబు ఉన్నారు.

డాక్టర్ యనమదలకు సాహితీ సత్కారం

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 8: కాకినాడకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ యనమదల మురళీకృష్ణను సాహితీ సత్కారంతో గౌరవించనున్నట్లు చిత్తూరుకు చెందిన ప్రసిద్ధ కుప్పం రెడ్డమ్మ సాహితీ అవార్డు ట్రస్టు ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 12న చిత్తూరు రాజమహల్‌లో జరగనున్న కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన నవలా రచయితలు ఎ.మునిసురేష్ పిళ్లయ్, కాశీపురం ప్రభాకర్‌రెడ్డి, కథానిక సంపుట రచయితలు రోహిణి వంజారి, డాక్టర్ ఎం.సుగుణరావు హాజరవుతారని ట్రస్టు అధ్యక్షురాలు డాక్టర్ పి.రోజాప్రియ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి.నిరంజన్‌రెడ్డి, వ్యవస్థాపకులు డాక్టర్ కె.రామలక్ష్మి తెలిపారు.

జ్యోతుల నెహ్రూ ప్రత్యేక పూజలు



సింహాచలంలో నెహ్రూ దంపతులు

జగ్గంపేట, జూన్ 8: జగ్గంపేట ఎమ్మెల్యేగా గెలిచిన జ్యోతుల నెహ్రూ విశాఖ జిల్లా సింహాచలం శ్రీ వారాహి లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం జ్యోతుల నెహ్రూ మణి దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి వేద పండితుల ఆశీర్వాదం తీసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నెహ్రూ మాట్లాడుతూ నాకు ఇంతటి ఘన విజయాన్ని అందించిన జగ్గంపేట నియోజకవర్గ ప్రజలందరూ ఆ స్వామి వారి కృపాకటాక్షాలతో ఎప్పుడు సుభిక్షంగా ఉండాలన్నారు. తోట సర్వారాయుడు, జంపన సీతారామచంద్రవర్మ, సింహాచలం రిటైర్డ్ పీఆర్వో తులా రామారావు, సుంకవిల్లి రాజు, పారంశెట్టి బాబ్జి, బోదిరెడ్ల సుబ్బారావు, కంటి కృష్ణార్జున ఉన్నారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, జూన్ 8: దుర్గాడ శివాలయంలో శనివారం జ్యేష్ఠమాసం ఆరుద్రనక్షత్రం సందర్భంగా మహాన్యాసపూర్వ ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శ్వేతార్క పుష్పమాలలు, దూర్వయగ్మమాలలు, మారేడుదళాలతో పంచాయతన సమేత ఉమాలింగేశ్వరస్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజలు నిర్వహించారు.



ఉమారామలింగేశ్వరస్వామి

రామోజీరావు సేవలు చిరస్మరణీయం

» ఈనాడు గ్రూపు సంస్థల అధినేత మృతికి తీవ్ర సంతాపం

» రామోజీరావు చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించిన జర్నలిస్టులు, నాయకులు



కాకినాడలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకుల నివాళి, పిఠాపురంలో సంతాపం ప్రకటిస్తున్న వర్మ, కిర్లంపూడిలో నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జూన్ 8: తెలుగు దినపత్రిక ఖ్యాతిని దశదిశలా చాటిన ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు సేవలు చిరస్మరణీయమని టీడీపీ నాయకులు కొనియాడారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే విజేత వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పలు డివిజన్లలో రామోజీరావు చిత్రపటాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పర్లోవపేట, దుమ్ములపేట, రేచెర్లపేట, జె.రామారావుపేట ప్రాంతాల్లో సంతాప సభలు నిర్వహించారు. స్థానిక 12వ డివిజన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్ ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత, లారీ యూనియన్ నాయకులు ఎలిపే శ్రీనివాస్, పెద్దిరెడ్డ నానాజీ, మైలిపిల్లి సత్తిబాబు, టీడీపీ నాయకులు కొంకోట చంద్రశేఖర్, తుమ్మల కొండలరావు, గంపల లక్ష్మణరావు, దిబ్బాడ సత్తిబాబు పాల్గొన్నారు. జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్ష కార్యదర్శిలు కొల్లాబత్తుల అప్పారావు, పలివెల రవి అనంతకుమార్, స్థానిక 10వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి చోడిపిల్లి సతీష్ సంతాపం తెలిపారు.

కాకినాడ సిటీ ఎమ్మెల్యే విజేత వనమాడి కొండబాబు మాట్లాడుతూ రామోజీరావు పత్రికా రంగానికి చేసిన సేవలు ఎనలేనివని, ఆయన మరణం చాలా బాధాకరమని సంతాపం వ్యక్తం చేశారు.

తెలుగు దినపత్రిక రంగంలో ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు ఎనలేని సేవలు అందించారని ఏపీ స్టేట్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ బోర్డు మాజీ సభ్యుడు చిరిమెళ్ల లక్ష్మీనారాయణ సంతాపం తెలిపారు.

సర్పవరం జంక్షన్: రామోజీరావు మృతి తీరనిలోటని కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా గెలిచిన పంతం నానాజీ అన్నారు. ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, చెరుకూరి రామోజీరావు మృతి పట్ల శనివారం గొడారిగుంటలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి నివాళులర్పించారు. వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి నివాసంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి రామోజీ మృతికి సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. కాకినాడ రూరల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. ఈనాడు జర్నలిస్ట్ ముత్యాల మూర్తిబాబు ఆధ్వర్యంలో రమణయ్యపేట మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జర్నలిస్టులు దైవ, ప్రవీణ్ గుప్తా, భైరెడ్డి రాజా, పుట్టా సాయిరామ్, శీల లక్ష్మణ్, చక్రరావు, సూర్యనారాయణ, రమేష్, పలివెల శ్రీను, సూర్య, ప్రసాద్, కుమార్, రాజేష్, శివప్రసాద్, మోహన్,శ్రీరామమూర్తి పాల్గొన్నారు. కాకినాడ రూరల్ టీడీపీ కో కోఆర్డినేటర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ ఫిల్మ్‌సిటీలో రామోజీరావు పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.

కార్పొరేషన్: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, రామోజీరావు మృతి పట్ల కాకినాడ జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సీనియర్ పాత్రికేయులు స్వాతిప్రసాద్ అధ్యక్షతన శనివారం సంతాప సభ ఏర్పాటు చేశారు. రామోజీరావు మరణం విచారకరమన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఈనాడు చిరంజీవి, చంద్రశేఖర్, శివన్నారాయణరెడ్డి, దురానీ, అంజిబాబు, ఎన్‌టీవీ సుధీర్, మంగా కృష్ణ, సలీమ్, వర్మ, రాయవరపు ప్రభాకర్, పిచ్చుక రఘు, గుండు శ్రీను, త్రినాద్, బాల, రాంజీ ఉన్నారు.

తుని రూరల్: తునిలో కూటమి పార్టీ శ్రేణులు శ్రద్ధంజలి ఘటించారు. టీడీపీ యువ నేత యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగసోమరాజు (అబ్బాయి), కోటనందూరు మండలాధ్యక్షుడు గాడి రాజబాబు, వి.కొత్తూరు మాజీసర్పంచ్ తమరాన రామకృష్ణ, రొంగల అబ్బు, చోడరాజు చిరంజీవిరాజు, పోలిశెట్టి అనీల్ పాల్గొన్నారు. తునిలో పాత్రికేయ ప్రతినిధులు, పాత్రికేయులు రామోజీరావు చితప్రటానికి నివాళులర్పించారు. సీనియర్ పాత్రికేయుడు పసగడుగుల రాంబాబు, గొల్లపల్లి సూర్య, కేశ్వ శివాజీ, బెక్కం శ్రీనివాస్, పప్పు గంగాధర్, గాజుల శ్రీనివాస్ ఉన్నారు.

జగ్గంపేట: రామోజీరావుకు జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమల్లపల్లి రమేష్ నివాళులర్పించారు. మేక వీరబాబు, గోకేడ ప్రసాద్, మాదరపు వీరబాబు, కిర్లంపూడి మండలాధ్యక్షులు ఉలిసి ఐరాజు, జగ్గంపేట మండలాధ్యక్షులు రామకృష్ణ, సూరంపాలెం బాలు, కోటి, జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, నండ్ల చిరంజీవిరావు రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రత్తిపాడు: రామోజీరావు ఆకస్మిక మరణం తీరనిలోటని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, మండలాధ్యక్షుడు అమరాది వెంకట్రావు, టీడీపీ నాయకులు గొంతిన సురేష్, మూది నారాయణ స్వామి, చీకట్ల నాని, గీద నానాజీ పాల్గొన్నారు. ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పైలాజ్ ప్రతినిధి బుగతా శివ తీవ్ర సంతాపం వెలిబుచ్చారు.

సామర్లకోట: రామోజీరావు మృతి పట్ల పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సామర్లకోట పరిధి మఠం సెంటర్ ఎన్టీఆర్ పార్క్ వద్ద రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదబ్రహ్మదేవం, జీమేడపాడులో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. తోటకూర శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనుబాబు, పాలకుర్తి వీరభవన్నారాయణ ఉన్నారు.

గండేపల్లి: టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు ఆధ్వర్యంలో గండేపల్లి జాతీయరహదారి పక్కన ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లేపల్లిలో గ్రామ అధ్యక్షుడు తెలగారెడ్డి భద్రరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జడ్.రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బొమ్మ సెంటర్‌లో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మురారిలో ఉపసర్పంచ్ జాస్తి వసంత్ రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఉండవల్లి బుల్లిరాజు, గద్దె అబ్బన్న, పెదవెంకన్న పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయం, కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి ఎంపీపీ తోట రవి, గాంధీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిర్లంపూడి సర్పంచ్ శ్రీలత రాంబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, ఆళ్ల శ్రీమన్నారాయణ, సూరిబాబు, ఆళ్ల బాబులు, ఎంపీటీసీ గరగ గోవిందు, సూరిబాబు, కృష్ణ, బొజ్జపు నాగేశ్వరరావు, వేలంక సర్పంచ్ రాయుడు బాబురావు ఉన్నారు.

తాళ్లరేవు: రామోజీరావు మరణానికి చింతిస్తూ తాళ్లరేవు ప్రెస్‌క్లబ్, జర్నలిస్టుల సంక్షేమ సంఘాలు నివాళులర్పించారు. జర్నలిస్టులు విత్తనాల సాంబశివరావు, కొమ్మిరెడ్డి వీరభద్రరావు, కొప్పిశెట్టి బుజ్జి, కాశి గంగాప్రసాద్, పూడా వెంకటరమణ పాల్గొన్నారు.

తొండంగి: యల్లయ్యపేటలో టీడీపీ నేత యనమల రాజేష్, టీడీపీ జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోడ వెంకట రమణ రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చొక్కా జగన్నాథం, చొక్క సత్యన్నారాయణ, కృష్ణమూర్తి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

పిఠాపురం: ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు మృతికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సంతాపం ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రామోజీరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

రౌతులపూడి: రామోజీరావు మృతికి టీడీపీ నేతలు మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. రౌతులపూడి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నివాళుల ర్పించారు. ఇటంశెట్టి అశోక్, పైల యర్రాపాత్రుడు, యర్రా వరహాలుదొర, చిటికేల వాసు, పైలదివాణం ఉన్నారు.

కొత్తపల్లి: రామోజీరావు మృతికి పలువురు మండల పాత్రికేయులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

మోకాళ్లపై కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం, జూన్ 8: సీఐటీయూ ఆధ్వర్యంలో చిన్నింపేట రహదారి చెంతన ఉన్న జీడిపిక్కల పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని బాధితులు శనివారం మోకాళ్లపై ఆందోళన చేపట్టారు. 7రోజుల నుంచి నిరసనలు చేస్తుంటే యాజమాన్యం కార్మికులను పట్టించుకోవడంలేదని సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు మండిపడ్డారు. గత కొన్నేళ్లుగా ఇంటర్ స్నాక్స్ కాజు ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో పనిచేస్తున్న కాంటాక్ట్ ఉద్యోగులను ఏ సమాచారం ఇవ్వకుండా సుమారు 80మందిని తొలగించారని, అధికారులు స్పందించి యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.సాల్మన్, యం.కృష్ణ, బి.నాని, సురేష్, నరేంద్ర తదితరులు ఉన్నారు.

'కూటమిలోకి వచ్చేందుకు వైసీపీ నాయకుల ప్రయత్నాలు'

సర్పవరం జంక్షన్, జూన్ 8: కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పంతం నానాజీకి రికార్డు స్థాయిలో మెజార్టీ సాధించడంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమష్టి కృషి ఉందని కూటమి నాయకులు పుల్ల శ్రీరాములు, పల్ల శ్రీరాములు, రాయుడు అన్నవరం, బత్తిన గోవింద్ అన్నారు. శనివారం సర్పవరంలో జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారం కోల్పోయిన స్థానిక వైసీపీ నాయకులు టీడీపీ కూటమిలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అదే జరిగితే పార్టీలో తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. సమావేశంలో కూటమి నాయకులు ముద్దన సూర్యప్రకాశరావు, తమ్మలపల్లి సత్యనారాయణ, కొప్పిశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

'దాడి చేసిన వారిని శిక్షించాలి'

కొత్తపల్లి, జూన్ 8: టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మపై శుక్రవారం రాత్రి జనసేన నాయకులు చేసిన దాడిని కొత్తపల్లి మండల టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అనిశెట్టి సత్యానందరెడ్డి, కరారి రాజబాబు, మేడిశెట్టి శ్రీరాములు, బత్తుల చైతన్య రాజేష్‌కుమార్, రెడ్నం దొరబాబు, వేమగిరి రాంబాబు, కూరాకుల సుధాకర్, గాది రాజబాబు, మేరుగు భూషణం, బాదిన నాగేశ్వరరావు,సూరాడ రాజు డిమాండ్ చేశారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

పెద్దాపురం, జూన్ 8: స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో గత పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో గత నెల 9 నుంచి జరుగుతున్న సమ్మర్ క్యాంప్ శనివారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదివారం బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. పీసీసీ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, రవికుమార్, పూజిత, మణికంఠ, బంగారం, సత్య, నేహారుణుక, పవన్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌బాబును కలిసిన నాయకులు

తుని రూరల్, జూన్ 8: మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత రాజా అశోక్‌బాబును కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య గెలుపులో కీలకంగా పనిచేసిన అశోక్‌బాబు సేవలను వారు అభినందించారు. కలిసినవారిలో తునికి చెందిన హోడపాటి శ్రీను, ఎస్.అన్నవరానికి చెందిన టీడీపీ నాయకులు పోలిశెట్టి రామలింగేశ్వరరావు, పోలిశెట్టి ధారబాబు ఉన్నారు.

'అందరికీ అందుబాటులో ఉంటా'

పిఠాపురం, జూన్ 8: అందరికీ అందుబాటులో ఉంటూ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తానని మాజీ ఎంపీ, పిఠాపురం వైసీపీ అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. పిఠాపురంలోని తన కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో విజయం సాధించిన జనసేన అధినేత పవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అన్నవరానికి కూటమి శ్రేణుల పాదయాత్ర



తునిరూరల్: పాదయాత్రగా అన్నవరం పయనమైన కూటమి శ్రేణులు



రౌతులపూడి: అన్నవరం నుంచి ప్రత్తిపాడు వెళ్లి రాజా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తుని రూరల్, జూన్ 8: తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య భారీ మెజార్టీతో గెలుపొందడంతో మండలంలో తేటగుంటకు చెందిన కూటమి పార్టీల కార్యకర్తలు శనివారం అన్నవరానికి పాదయాత్రగా వెళ్లారు. పాదయాత్రను టీడీపీ యువ నేత యనమల రాజేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మా అభిమాన నేత యనమల రామకృష్ణుడు కుమార్తె యనమల దివ్య అఖండ మెజార్టీతో సాధించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని. సత్యదేవునికి మొక్కు చెల్లించేందుకు పాదయాత్రగా అన్నవరం తరలివెళ్లినట్లు తెలిపారు. సత్యదేవుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరికీ కూటమి ప్రభుత్వంతో మేలు జరగాలని, అన్ని వేళాలా కలిసి రావాలన్నారు. పాదయాత్రలో తేటగుంట టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు గజ్జి రాంబాబు, కొల్లు సత్యనారాయణ, నిమ్మల నానాజీ, గెడ్డం శివ, మర్రి వీరబాబు తదితరులు ఉన్నారు.

రౌతులపూడి నుంచి...

రౌతులపూడి: ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో తెలుగుయువత రౌతులపూడి మండలాధ్యక్షుడు పైల అశోక్ ఆధ్వర్యంలో యువకులు అన్నవరం పాదయాత్ర చేశారు. దుర్గాదేవి ఆలయం నుంచి గిడజాం, ఎస్.అగ్రహారం, తేటగుంట మీదుగా అన్నవరం చేరుకుని పూజలు చేశారు. తర్వాత ప్రత్తిపాడు వెళ్లి సత్యప్రభకు అభినందనలు తెలిపి దివంగత నేత వరుపుల రాజా విగ్రహానికి నివాళులర్పించారు.

శృంగారవల్లభ స్వామి ఆలయానికి...

పెద్దాపురం: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో పాటు, పెద్దాపురంలో కూటమి తరుపున నిమ్మకాయల చినరాజప్ప ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించడంతో టీడీపీ శ్రేణులు పాదయాత్ర చేపట్టారు. సీనియర్ టీడీపీ నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజాసూరిబాబురాజు ఆధ్వర్యంలో ఆయన స్వగృహంనుం వందలాదిగా కార్యకర్తలు తొలితిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయానికి పాదయాత్రను చేపట్టారు. ఆలయానికి చేరుకుని శృంగారవల్లభుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారీ కేకును కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తిం వెంకట శ్రీనివాసరావు (కోటి), కందుల విశ్వేశ్వరరావు, పొలమరశెట్టి సత్తిబాబు, మేడిది శ్రీనివాస్, మెయిళ్ల కృష్ణమూర్తి, తూతిక రాజు, బందిలి సుబ్రహ్మణ్యం, తుమ్మల నాని, మత్తాల రాజు,అధికంగా టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దాపురం: శృంగారవల్లభ స్వామి ఆలయంలో కేక్ కట్ చేస్తున్న రాజాసూరిబాబురాజు

ఎమ్మెల్యేలుగా గెలిచినవారికి అభినందనలు



సర్పవరం జంక్షన్: నానాజీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నులుకుర్తి వెంకటేశ్వరరావు

సర్పవరం జంక్షన్, జూన్ 8: కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా రికార్డు మెజారిటీతో విజయం సాధించిన పంతం నానాజీని శనివారం గొడారిగుంటలో ఎమ్మెల్యే నివాసంలో టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, పాయకరావుపేట ఎన్నికల కోఆర్డినేటర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు కలిసి అభినందనలు తెలిపారు. నానాజీని కాకినాడ రూరల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు దైవ, ప్రవీణ్ గుప్తాల ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. జర్నలిస్టులు భైరెడ్డి రాజా, పుట్టా సాయిరామ్, శీల లక్ష్మణ్, చక్రరావు, సూర్యనారాయణ, రమేష్, పలివెల శ్రీను, సూర్య ప్రసాద్, కుమార్, రాజేష్, శివప్రసాద్, మోహన్, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా విజయం సాధించిన వరుపుల సత్యప్రభను ధర్మవరానికి చెందిన మాజీ మండల ఉపాధ్యక్షుడు బొల్లు కొండబాబు ఆధ్వర్యంలో వార్డు మెంబర్ వెంకటలక్ష్మి, నాయకులు కలిసి అభినందించారు.

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గం నుంచి మూడోసారి అత్యధిక ఓట్ల మెజార్టీతో నిమ్మకాయల చినరాజప్ప ఎమ్మెల్యేగా గెలుపొందడంతో హుస్సేన్‌పురానికి చెందిన టీడీపీ నేత చల్లా బుజ్జి ఆధ్వర్యంలో రాజప్పను భారీ గజమాలతో శనివారం ఘనంగా సత్కరించారు. సామర్లకోట మండలం అచ్చంపేటలోని రాజప్ప స్వగృహంలో పలువురు నాయకులు, కార్యకర్తలు అభినంనలు తెలిపారు. చల్లా కొండ, కోట అప్పారావు, మార్ని వీర్రాజు, గుత్తిచ సత్తిబాబు, తలారి శ్రీనివాస్, పలివెల చంద్రశేఖర్ ఉన్నారు.





ప్రత్తిపాడు: సత్యప్రభకు టీడీపీ నేతల అభినందన, సామర్లకోట: చినరాజప్పకు సత్కారం

గొర్రిపూడిలో సీసీ డ్రైన్‌పై ఆక్రమణలు



ఒక ఇంటి ముందు సీసీ డ్రైన్‌ను ఆక్రమించి ఏర్పాటు చేస్తున్న షెడ్డు

కరప, జూన్ 8: గొర్రిపూడిలో రోడ్డుకిరువైపులా నిర్మించిన సీసీ డ్రైన్‌లను పలువురు వ్యాపారస్తులు ఆక్రమించుకుని వాటిపై పర్మినెంట్ స్ట్రక్చర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై స్థానికులు అభ్యంతరాలు తెలుపుతున్నా వ్యాపారులు పట్టించుకోకుండా ఐరన్ పోల్స్‌తో షెడ్‌లను ఏర్పాటు చేసి డ్రైన్‌లను పూర్తిగా ఆక్రమించుకుంటున్నారు. దీని వల్ల డ్రైన్ పూడికలు తొలగించడం సాధ్యపడక మురుగు నీరు స్తంభించిపోతుందని, రోడ్డుపై రాకపోకలకు ప్రతిబంధకాలు ఏర్పడతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శనివారం సచివాలయంలో ఫిర్యాదు చేసి ఆక్రమణలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. కాగా దీనిపై పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా సీసీ డ్రైన్‌లపై షెడ్‌లను ఏర్పాటు చేసినవారికి నోటీసులు జారీచేసి ఆక్రమణలు తొలగిస్తామని వివరించారు.

పోషకాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు, జూన్ 8: ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం వద్ద శనివారం సదామీసేవలో స్వచ్ఛంద సంస్థ నిరుపేద చిన్నారులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లను షిర్డిసాయి జ్యూయలర్స్ అధినేత పడాల శ్రీనివాస రెడ్డి తన సొంత నిధులతో కొనుగోలు చేసి అందజేశారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ సలాదికృష్ణ, సేవా సంస్థ సభ్యులు జి.సత్యానందం, కె.జగదీశ్వరి, మణికంఠ జ్యోతి పాల్గొన్నారు.

ఆహార భద్రత దినోత్సవం

గండేపల్లి, జూన్ 8: సూరంపాలెంలోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఫోరెనిక్స్ సైన్స్ విభాగంలో ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. 30మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఈ దినోత్సవంపై మాట్లాడారు. ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ పి.నాగేశ్వరరావు, విలాస్ అనిల్ చవాన్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ టికె విద్యాసాగర్, స్టాఫ్ రిప్రజెంటేటివ్ బి.ఉదయనాధ్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి చిక్కాల పరామర్శ

తాళ్లరేవు, జూన్ 8: సుంకరపాలెం టీడీపీ సీనియర్ నేత మోపూరి వెంకటరెడ్డినాయుడు తల్లి సూర్యనారాయణమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు శనివారం పరామర్శించారు. సూర్యనారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. టీడీపీ నేత మోపూరి వెంకటేశ్వరావు, కార్యకర్తలు ఉన్నారు.

మరిడమ్మ జాతరకు శ్రీకారం

పెద్దాపురం, జూన్ 8: మరిడమ్మ జతర మహోత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు శనివారం శ్రీకారం చుట్టారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆనవాయితీ ప్రకారం తొలిగరగల సంబరాన్ని నిర్వహించి సామర్లకోట పుట్టింటికి పంపించారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు, ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మజీ, వేదపండితులు, ఆసాదులు పాల్గొన్నారు.

బెంచీల బహూకరణ

తుని రూరల్, జూన్ 8: తుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలో గల సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు రూ.40వేల విలువ గల బెంచ్‌లను బహూకరించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు స్వామి అభ్యర్థన మేరకు రోటరీ క్లబ్ బెంచీలు అందజేసింది. రోటరీ అధ్యక్షులు కేఎస్ఎల్ఎస్ వర్మ, సెక్రటరీ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ ఈశ్వర్ గణేష్, మంగరాజు, వీర్రాజు, మోహన్‌కృష్ణ, వివేక్, నర్సిబాబు పాల్గొన్నారు.

14న జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 8: ఈనెల 14న కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రముఖ కంపెనీలు హెట్రో ఫార్మా నక్కపల్లి, సీన రేజీస్ వైజాగ్, రామకృష్ణ ఎలక్ట్రికల్ అండ్ రివైండింగ్ వర్క్స్ కాకినాడ, వరుణ్ మోటార్స్ కాకినాడలో ఉద్యోగాల కోసం ఐటీఐ పాసైన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 130 ఖాళీలు భర్తీ చేస్తారని, విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తోపాటు సెట్ జెరాక్స్ కాపీలు తెచ్చుకోవాలన్నారు.